జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమం

ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

వంగిపురం (ప్రత్తిపాడు): కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమాన్ని పేదలకు అందించన ఘనత సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. ప్రత్తిపాడు మండలం వంగిపురంలో శుక్రవారం రాత్రి గుండెగుండెకూ జగనన్న- గడపగడపకూ కిరణన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బలసాని కిరణ్‌కుమార్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. రావిపాడు నుంచి వంగిపురం వరకు పార్టీ శ్రేణులు ద్విచక్ర వాహనాలు, కార్లతో భారీ ర్యాలీగా జై జగన్, జై బలసాని నిదానాలతో గ్రామంలోకి స్వాగతించారు. తొలుత దళితవాడ సమీపంలో జగ్జీవన్‌రావ్ విగ్రహానికి బలసాని పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దళితవాడలో గడపగడపకూ వెళ్లి పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన మంచిని, చేకూరిన లబ్ధిని వివరిస్తూ తనను ఆశీర్వదించాలని బలసాని ప్రజలను కోరారు.



వంగిపురంలో ప్రచార రథంపై కిరణ్‌కుమార్

సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో..

ఈ సందర్భంగా బలసాని మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయలేని విధంగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు సంక్షేమ పథకాల్ని అమలు చేసిందని తెలిపారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వ్యవసాయ, పశు ప్రయోగశాలల నిర్మాణం, ఆస్పత్రుల ఆధునికీకరణ తదితర అనేక అభివృద్ధి కార్యక్రమాల్ని సైతం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని చెప్పారు. బడుగు, బలహీన వర్గాలకు సైతం రాజకీయంగా ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో మేలు జరిగిన ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి సీఎం జగన్‌ను, ప్రత్తిపాడు నుంచి తనను ఆశీర్వదించాలని ప్రజల్ని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువత క్రీడల్లోనూ రాణించాలి



ప్రత్తిపాడు: యువత క్రీడల్లోనూ రాణించాలని జేఎన్‌టీయూకే డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్స్ బి. బాలకృష్ణ సూచించారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సంస్కృతి–2024 జాతీయ స్థాయి కల్చరల్, స్పోర్ట్స్ ఫెస్ట్ ఘనంగా ప్రారంభమయ్యాయి. కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు శాంతి కపోతాల్ని ఎగురవేసి ప్రారంభించగా, ముఖ్య అతిథిగా హాజరైన బి. బాలకృష్ణ క్రీడా జ్యోతిని వెలిగించి పోటీల్ని ఆరంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంలో అకడమిక్స్‌తో పాటు క్రీడలనూ ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. విద్యార్థులంతా క్రీడలతో పాటు ఫెస్ట్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ రోజురోజుకీ టెక్నాలజీ అభివృద్ధి చెందుతోందని, యువత దాన్ని అందిపుచ్చుకుని, ఆలోచనాశక్తిని పెంచుకోవాలని సూచించారు. కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న నిపుణ్యాల్ని వెలికితీసేందుకు ఏటా కళాశాలలో సంస్కృతి ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఫెస్ట్‌కు పలు ఇంజినీరింగ్ కళాశాలల నుంచి నాలుగు వేల మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రోగ్రాం కన్వీనర్ గోనుగుంట్ల రామస్వామి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జెట్టి అప్పారావు , డీన్ పోపూరి రమేష్ బాబు, ప్రొఫెసర్ జంపని కిశోర్‌బాబు, కో కన్వీనర్లు దొమ్మేటి విజయసారథి, హరికృష్ణ, కందెపు సునీత, ఆయా విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధి స్టార్టప్‌లతోనే సాకారం

గుంటూరు రూరల్: దేశాభివృద్ధి నూతన ఆవిష్కరణలు, వ్యవస్థాపకత స్టార్టప్‌లతోనే సాకారం అవుతాయని మధ్యప్రదేశ్‌కి చెందిన మంగళ్యాతాన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కె.ఆర్.ఎస్ సాంబశివరావు తెలిపారు. నగర శివారుల్లోని లాంనందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో శుక్రవారం అధ్యాపకులకు నిర్వహించిన స్టార్టప్ ఫర్ ఎన్‌హాన్సింగ్ ఇన్నోవేషన్, ఎంట్రప్రీన్యూర్‌షిప్ స్టార్టప్స్ అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులు సామర్థ్యాన్ని చక్కదిద్దుకుని వ్యవస్థాపకులు, ఆవిష్కరణకర్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అధ్యాపకులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు, చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట రోశయ్య

చేబ్రోలు: మండలంలోని వేజండ్ల గ్రామానికి చెందిన పేద కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకటరోశయ్య శుక్రవారం అందజేశారు. వేజండ్ల గ్రామానికి చెందిన పరిశా శివయ్య గుండె సంబంధ వ్యాధితో బాధపడుతూ వైద్యశాలలో చికిత్స పొందారు. కొద్ది రోజుల కిందట మరణించడంతో అతని భార్య వెంకట సుబ్బమ్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును రోశయ్య అందజేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపన దిశగా ఆలోచనలు సాగాలి

గుంటూరు రూరల్: విద్యార్థులంతా అంకుర పరిశ్రమల స్థాపన దిశగా ఆలోచనలు చేస్తూ అందుకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి చేసుకోవాలని ఆంధ్రా యూనివర్సిటీ ఇంక్యూబేషన్ కౌన్సిల్ సీఈవో డైరెక్టర్ ఈశ్వరపు రవి తెలిపారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎచీవింగ్ ప్రాబ్లెమ్స్ సొల్యూషన్స్ ఫిట్ ప్రొడక్ట్ ఫిట్, అంకుర పరిశ్రమల స్థాపన అనే అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈశ్వరపు రవి మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఆలోచనలతో అందివచ్చిన సాంకేతికతను సద్వినియోగించుకుని సమాజాభివృద్ధికి ఉపయోగపడే నూతన పరిశోధనలు, పరిశ్రమలవైపు ఆలోచన చేయాలని సూచించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఇంక్యూబేషన్ కౌన్సిల్ మేనేజర్ దినకర్ వాడపల్లి, కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి స్ఫూర్తితో పేదలకు భరోసా

- పొన్నూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- వేజండ్లలో 888 మందికి ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ

వేజండ్ల (చేబ్రోలు): ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో పేదలకు నేత్ర జ్యోతి, మీ గుండె పదిలం, దివ్యాంగులకు చేయూతల ద్వారా భరోసా కల్పిస్తున్నట్లు పొన్నూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల జెడ్పీ హైస్కూల్ దగ్గర బజరంగ్ సంక్షేమ సంగమం కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 25న 'నేత్రజ్యోతి' శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు 888 మందికి కళ్లజోళ్లు అవసరమని డాక్టర్లు నిర్ధారించడంతో శుక్రవారం వారికి ఉచితంగా అంబటి మురళీకృష్ణ అందజేశారు. కార్యక్రమంలో బజరంగ్ సేవా బృందం సభ్యులు, గ్రామస్తులు, స్థానిక పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ఆశీర్వాదంతో విజయం మనదే...

పొన్నూరు: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని, ఆయన చేసిన మేలును మరువకుండా పొన్నూరు ప్రజలు వైఎస్సార్ సీపీని విశేషంగా ఆదరిస్తున్నారని సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఐదో వార్డుకు చెందిన పార్టీ సీనియర్ నాయకులు షేక్ పెద్ద గఫారి, వార్డు ప్రజలు మామిళ్లపల్లిలోని నివాసంలో అంబటి మురళీకృష్ణ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు షేక్ జానీ బాషా, సుభాని, అస్మతుల్లా, బాషా, సమీర్ పాల్గొన్నారు.



వృద్ధుడికి కళ్లజోడు పంపిణీ చేస్తున్న మురళీకృష్ణ

- **వైఎస్సార్ పింఛన్ల పంపిణీ**

వేజండ్ల(చేబ్రోలు): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా ఇంటి వద్దకే అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పొన్నూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. వేజండ్లలోని వైఎస్సార్ సెంటర్‌లో మహానేత విగ్రహం వద్ద శుక్రవారం రాత్రి ఆయన పలువురికి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బత్తుల అనూరాధ, పొన్నూరు జెడ్పీటీసీ సభ్యుడు కర్లపూడి రమేష్, గ్రామ సర్పంచ్ జువ్వా హైమావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు వడ్రాణం ప్రసాదరావు, షేక్ నాజర్, ఆళ్ల శ్రీరామిరెడ్డి, బత్తుల గోవిందరాజులు, వీరాస్వామి పాల్గొన్నారు.



పింఛన్ల పంపిణీలో పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

రైతుల పాలిట కల్పవృక్షాలు - మన గుంటూరు కోల్డ్ స్టోరేజీలు

Advt Special Feature

రైతులకు ప్రయోజనకరంగా కోల్డ్ స్టోరేజీలు

- జిల్లా వ్యాప్తంగా 120కి పైగా రైతులకు సేవలు
- నెలల తరబడి తాజాగా పంటలు
- రైతులకు సహాయకారిగా యజమానులు
- తక్కువ ధరలకే నిల్వ అవకాశం

కొరిటిపాడు(గుంటూరు): గతంలో పంటల్ని నిల్వ చేసుకోవాలంటే రైతులు అనేక కష్టాలు పడేవారు. ఇళ్లు, పొలాల్లోనూ జాగ్రత్తగా భద్రపరచుకునేవారు. అయితే, కీటకాలు, మూషికాల బారినుంచి కాపాడుకునేందుకు అవస్థలు పడేవారు. కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుతో క్రమేణా రైతులు ఆ బాధలు నుంచి బయటపడ్డారు. పండించిన పంట తొలుత ఎలా ఉందో నెలలు గడిచిన, అమ్మే వరకు తాజాగా ఉంటుంది. రైతులకు ప్రయోజనకరంగా జిల్లావ్యాప్తంగా కోల్డ్ స్టోరేజీలు వందల్లో ఏర్పడ్డాయి.

నాణ్యమైన మౌలిక సౌకర్యాలు

గుంటూరు జిల్లాలో సుమారు 120కి పైగా శీతల గిడ్డంగులు ఉన్నాయి. గుంటూరు నగరానికి అనుసంధానంగా సుమారు 90పైగా అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో స్థానిక రైతులతో పాటు ఇతర జిల్లాల్లోని వారు సరుకు భద్రపరుచుకునేందుకు నిర్వాహకులు నాణ్యమైన మౌలిక సౌకర్యాలు కల్పించారు. విశాలమైన గదులు, లిఫ్ట్ సౌకర్యం, రైతులు బస చేసేందుకు వీలుగా విశ్రాంతి గదులు, తక్కువ ధరలకే బస్తాలను అద్దెకు భద్రపరుచుకునేలా ఏర్పాట్లు చేశారు. దీంతో గుంటూరు నగర శివారు ప్రాంతాలతో పాటు కర్నూలు, అనంతపురం, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు, తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా, కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి నుంచి రైతులు మిర్చిని విక్రయించుకునేందుకు ఇక్కడ శీతల గిడ్డంగులను ఆశ్రయిస్తుంటారు. రైతుల రాకతో గిడ్డంగులు నిండు కుండలా మారుతున్నాయి.

రైతులకు సేవల్లో ముందంజ

గిడ్డంగుల యజమానులు రైతులకు మరిన్ని సౌకర్యాలను కల్పించడంలో ముందంజలో ఉంటున్నారు. కొందరైతే ఏకంగా రుణాలు సైతం ఇప్పిస్తున్నారు. దీని ద్వారా రైతులకు లాభదాయకంగా మారింది. వ్యవసాయ మార్కెట్ యార్డుకి తీసుకొచ్చిన సరుకు ఏదైనా అమ్మకం జరగకపోయినా వెంటనే గిడ్డంగుల్లో అరబెట్టేందుకు అవకాశాలు కల్పిస్తున్నారు. దీనికితోడు శీతలీకరణ (ఏసీ) నిర్వహణ బేషుగ్గా నిర్వహిస్తున్నారు. 6 నుంచి 8 డిగ్రీల వరకు నిర్వహణ చేస్తున్నారు. కోల్డ్‌స్టోరేజీల నిర్వాహకులు సైతం తక్కువ ధరలకే పంటలను నిల్వ చేసుకుంటున్నారు. రైతులు నిల్వ ఉంచిన సరుకును ఎంచక్కా అధిక ధరలకు విక్రయించుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

సరుకు నిల్వపై పురుగు మందుల వాడకం

పురుగు మందుల వాడకం కూడా సరుకు నిల్వపై ప్రభావం చూపుతుందని గిడ్డంగుల యజమానులు అంటున్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకు మంచి విత్తనాలు తీసుకుని, వారి ఆచరణకు అనుగుణంగా మందుల వాడకం వల్ల అధిక దిగుబడికి అవకాశం ఉంది. దానికితోడు సరుకులో నాణ్యత పెరుగుతుంది. దీనివల్ల రైతులు అందరూ లాభదాయంగా ఉంటారని కోల్డ్ స్టోరేజ్ యజమానులు సూచిస్తున్నారు.

పంట నాణ్యతకు పెద్దపీట

రైతుల శ్రమను దృష్టిలో ఉంచుకుని అతి తక్కువ ధరలకే పంటను గిడ్డంగుల్లో నిల్వ చేసుకునే అవకాశం కల్పిస్తున్నాం. దీనికితోడు సరుకు పాడవకుండా నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నాం. రైతులు పండించిన పంటను సకాలంలో అమ్ముకోవాలంటే ఒక్కోసారి కుదరదు. ఎందుకంటే కాస్తంత ధర పలికితే విక్రయించాలని చూస్తుంటారు. ఒక్కొక్కసారి గిట్టుబాటు ధర లభించకపోవచ్చు. ఈ సమయంలో సరుకును గిడ్డంగుల్లో నిల్వ చేసుకుని ఆశించిన ధర వచ్చినప్పుడు విక్రయించుకోవచ్చు. కొన్ని కోల్డ్‌స్టోరేజ్‌ల యాజమాన్యాలు రైతులకు బ్యాంకు రుణాలు సైతం అందిస్తున్నాయి. ప్రభుత్వం కూడా విద్యుత్తు సబ్సిడీ కల్పిస్తే తక్కువ ధరకే సరుకును భద్రపరుచుకునేందుకు అవకాశం ఉంటుంది.

–తదకమళ్ల సూర్యప్రకాశరావు,
ది కోల్డ్‌స్టోరేజీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

గిడ్డంగుల్లో 45 లక్షల మిర్చి బస్తాలు నిల్వ

కోల్డ్‌స్టోరేజ్‌లకు ఇప్పుడిప్పుడే మిర్చి బస్తాలు వస్తున్నాయి. ఇప్పటి వరకు 16 లక్షల టిక్కీలు పాతవి, మరో 29 లక్షల టిక్కీల కొత్త సరుకు చేరుకుంది. రైతులకు మంచి సర్వీసు అందిస్తున్నాం. మొత్తంగా 45 లక్షల బస్తాలను రైతులు నిల్వ చేసుకున్నారు. బస్తా ఒక్కింటికి రూ.210 మాత్రమే వసూలు చేస్తున్నాం. కోవిడ్ కాలంలో కూడా గిడ్డంగులు రైతులకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. సరుకు నాణ్యతలో గిడ్డంగుల యజమానులు రాజీపడటంలేదు. అందులో శీతలీకరణలో మరింత నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నాం. రైతులకు మంచి సర్వీసు ఇవ్వాలన్నది ప్రతి ఒక్కరిలో ఉంది.

–పి.సురేంద్రబాబు,
ది కోల్డ్ స్టోరేజీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి